క్లుప్తంగా

వాహన నిర్వహణ టెండర్లకు ఆహ్వానం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని వివిధ విభాగాల్లో వాహనాల నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ గురువారం తెలిపారు. రెండు జీప్‌లు అవసరం ఉందని ఈ నెల 28 లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. రూ.590 ఫీజుతో ఫైనాన్స్ విభాగంలో దరఖాస్తు ఫారం పొందాలని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

20 శాతం ఐఆర్ ప్రకటించాలి

టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం ఐఆర్ ప్రకటించాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాంకుడోత్ హత్తీరాం నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో జరిగిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎస్ఏలుగా ప్రమోషన్స్ ఇచ్చిన తరువాత బదిలీలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్‌నాయక్, వి.రమేష్‌బాబు, నాయకులు రాంజీ నాయక్ , శంకర్, పూల్సింగ్ నాయక్, రవి, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం స్వాధీనం

జూలూరుపాడు: అక్రమంగా రేషన్‌బియ్యాన్ని ద్విచక్రవాహనాలపై తరలిస్తుండగా పోలీసులు గురువారం జూలూరుపాడులో పట్టుకున్నారు. ఎస్సై బి.పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. పాపకొల్లు గ్రామానికి చెందిన నరసింహారావు, రామారావు, రఘు తమ ద్విచక్ర వాహనాలపై మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు బియ్యాన్ని, మూడు సెల్ ఫోన్లు, మూడు బైక్‌లు సీజ్ చేసి సంబంధిత వ్యక్తులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పురుషోత్తం పేర్కొన్నారు.

సమ్మె విరమణ నోటీసు అందజేత

టేకులపల్లి: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు మంత్రులతో జరిగిన చర్చల్లో సానుకూల హామీ రావడంతో బుధవారం సమ్మె విరమించారు. ఈ మేరకు గురువారం ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు పరిధిలోని టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సీడీపీఓ కె.ఎం.తారను కలిసి సమ్మె విరమణ నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండపల్లి శకుంతల, పి.రాజేశ్వరి, జయశ్రీ, ఐ.రాధ, కె.భద్రమ్మ, మల్లుబాయి, సుగుణ, లలిత, బిచ్చాలి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతితో కూడిన బదిలీలు చేపట్టాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎస్‌జీటీ, ఎల్‌పీ, పీఈటీ ఉపాధ్యాయులకు పదోన్నతితో కూడిన బదిలీలు చేపట్టాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌లో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. విద్యామంత్రితో మాట్లాడి సీనియర్ ఉపాధ్యాయులకు నష్టం జరుగకుండా పదోన్నతులతో కూడిన బదిలీలు జరిగే విధంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే వనమా హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మండలాధ్యక్షుడు సంగమేశ్వరరావు, మహిళా అసోసియేషన్ అధ్యక్షులు దుర్గారాణి, జె రమేష్, టి మోహన్, కామేశ్వరి, వీరాస్వామి పాల్గొన్నారు.

రాణి దుర్గావతి జయంతి

జూలూరుపాడు: కొమరం భీం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం గోండ్వానా రాణి దుర్గావతి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాణి దుర్గావతి చిత్రపటానికి ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తెల్లం నరసింహారావు దొర, కొమరం భీం ఫౌండేషన్ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొమరం భీం ఫౌండేషన్ కమిటీ సభ్యులు బచ్చల లక్ష్మయ్య, మడి రవి, సోడె శ్రీరాం, వీరభద్రం, కోరం నరేష్, బి రమేష్, అంజిబాబు, శ్రీకాంత్, భద్రం, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మలతో నిరసన

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ పంచాయితీ టెక్నికల్ సిబ్బంది చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో బతుకమ్మలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భద్రాచలం డీఎల్పీఓ పవన్‌కుమార్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు, దిశ కమిటీ సభ్యురాలు సిరిపురపు స్వప్న, బూర్గంపాడు మండల సర్పంచ్‌లు భూక్య దివ్యశ్రీ, శ్రావణి, పుల్లారావు, సెక్రటరీలు బాలయ్య, మురళీమోహన్, మహేష్, భవానీ తదితరులు సంఘీభావం తెలిపారు.

మోకాళ్లపై నిల్చుని భోజన కార్మికులు..
మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెలో భాగంగా గురువారం మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, కె.రత్నకుమారి, మేదిని లక్ష్మి, భూలక్ష్మి, ప్రభావతి, మంగ, శ్రీదేవి, లక్ష్మి, రాధ, ఆకుల పద్మ, కాంత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నిధుల జాడేది..?!

- 51 క్రీడాప్రాంగణాల్లో.. ఏడింటికే మంజూరు
- నిర్మాణాలతో అప్పుల పాలైన సర్పంచ్‌లు
- ఎవరికీ పట్టని పల్లె ప్రజాప్రతినిధుల ఇక్కట్లు



కీడాప్రాంగణంలో ఏర్పాటుచేసిన సింగిల్, డబుల్ బార్‌లు (ఇన్‌సెట్) సుదిమళ్లలోని క్రీడా ప్రాంగణం

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీలకు ప్రతీనెలా నిధులు మంజూరు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రారంభంలో అన్ని సక్రమంగా సర్దుబాటు చేయగా పనులు ముందుకు సాగాయి. కానీ ఏడాది తిరిగే సరికి నిధుల మంజూరులో చోటుచేసుకున్న ఆలస్యం ప్రజాప్రతినిధులకు ఇబ్బందులను తెచ్చిపెట్టింది. పనులప్రగతిపై అధికారుల ఒత్తిడి, నిధులు వస్తాయన్న నమ్మకంతో అప్పు చేసి పెట్టుబడి పెట్టిన ప్రజాప్రతినిధులు ఇప్పుడు బిల్లులు రాక, అప్పులు తీరే మార్గం లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

వడివడిగా మంజూరు..
పల్లెల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని 2022 మే 18న సీఎం కేసీఆర్ నిర్ణయించారు. దీంతో అధికారులు పల్లెల్లో నిర్మాణాలకు శ్రీకారం చుట్టగా.. ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. ప్రతీ గ్రామపంచాయతీకి ఒకటి చొప్పున, కొన్నాళ్లకు ఆవాసానికి ఒకటి ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో ప్రజాప్రతినిధులు పనులు ప్రారంభించారు.

ఇబ్బందికరంగా స్థలాల కేటాయింపు
క్రీడాప్రాంగణాలకు అవసరమైన ఖాళీ స్థలాలు లేక రెవెన్యూ అధికారులు కొంత ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరగడంతో ఖాళీగా ఉన్న స్థలాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని తొమ్మిది గ్రామాల్లో పాఠశాల క్రీడా స్థలంలోనే క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మరికొన్ని గ్రామాల్లో అటవీ భూములను కేటాయించారు. కాగా, బాలాజీనగర్, ధనియాలపాడు, సీఎస్పీ బస్తీ జీపీల్లో శ్మశానవాటికల పక్కన భూమి కేటయించడంతో నిర్మాణాలు చేపట్టలేదు.

స్థలాలు బాగాలేక పెరిగిన వ్యయం
పాఠశాలలు మినహా రెవెన్యూ, అటవీశాఖలు కేటాయించిన స్థలాలు రాళ్ల గుట్టలు, ముళ్ల పొదలతో ఉన్నాయి. స్థలాలను శుభ్రం చేసేందుకు కేవలం ఉపాధి కూలీల పనిదినాలను వినియోగించాలని నిబంధన కారణంగా శుభ్రం చేయడం ప్రజాప్రతినిధులకు శక్తికి మించిన పనిగా మారింది. ఈ క్రమంలో గ్రామపంచాయతీ నిధులు వెచ్చించి యంత్రాల సహాయంతో స్థలాలను శుభ్రం చేయించాలనే అధికారులు మౌఖిక ఆదేశాలతో పనులు చేపట్టగా బడ్జెట్ పెరిగిపోయింది. ఇక మొరం తోలకానికి మరిన్ని నిధులు వెచ్చించాల్సి వచ్చింది.

ఆటలకు అనువుగా...
క్రీడా ప్రాంగణంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. లాంగ్ జంప్ సాధన చేసేందుకు ప్రత్యేకంగా గుంతను తవ్వి అందులో ఇసుకతో నింపాలి. వ్యాయామం చేసేందుకు సింగిల్, డబుల్ బార్‌లను ఏర్పాటు చేయాలి. వీటితోపాటు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించాలి. ఇంకా ముఖద్వారంలోప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంటంది. ఇవన్నీ చేసేందుకు ప్రభుత్వం కేటాయించిన నిధులకు రెట్టింపు ఖర్చయిందని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

50 నిర్మిస్తే ఏడింటికే నిధులు
మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా స్థల సమస్య కారణంగా మూడు పంచాయతీలలో క్రీడా ప్రాంగణాలను నేటికీ నిర్మించలేదు. 26 జీపీలకు గాను ఇప్పటివరకు 50 క్రీడా ప్రాంగణాలను పూర్తి చేశారు. ఇందుకోసం రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వెచ్చించారు. నిర్మాణాలు పూర్తయి ఏడాది గడుస్తుండగా విజయలక్ష్మినగర్, రేపల్లెవాడ, చల్లసముద్రం, ఒడ్డుగూడెం, మామిడిగుండాల, బొజ్జాయిగూడెం, సుదిమళ్ల జీపీల్లో ఒక్కొక్కటి చొప్పున ఏడింటికే నిధులు మంజూరయ్యాయి. మిగతా 43 క్రీడా ప్రాంగణాలకు నిధుల జాడలేక ప్రజాప్రతినిధులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

వడ్డీలు కట్టలేకపోతున్నాం



క్రీడా ప్రాంగణానికి నేటికీ రూపాయి మంజూరు కాలేదు. అధికారుల ఆదేశంతో పనులు పూర్తి చేశారు. ఇందుకోసం దొరికినకాడల్లా అప్పులు చేసి ఇప్పుడు నిధులు రాక వడ్డీ కట్టలేకపోతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నిధుల మంజూరుకు కృషి చేయాలి.

– ధనసరి ప్రవంతి, సర్పంచ్, తిలక్‌నగర్ జీపీ

బిల్లులు కూడా చేయడం లేదు



పనులు త్వరగా పూర్తి చేయాలని తొందర పెట్టారు. దీంతో అందినకాడల్లా అప్పు చేసి పనులు పూర్తి చేశాం. అట్టహాసంగా ప్రారంభించినా బిల్లు రికార్డు కూడా చేసేందుకు అధికారులు రావడం లేదు. అప్పుకు వడ్డీలు పెరుగుతుందే తప్ప అధికారుల్లో స్పందన లేదు.

– బానోత్ సంతు, సర్పంచ్, బోయి తండా జీపీ

మంజూరు కోసం నివేదించాం



మండలంలో 50 క్రీడా ప్రాంగణాలు పూర్తిచేశాం. ఇప్పటి వరకు ఏడింటికి పూర్తిస్థాయిలో నిధులు మంజూరయ్యాయి. బిల్లు రికార్డు పూర్తయిన వాటి నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదించాం. మిగిలిన బిల్లులు కూడా చేయించి నిధుల మంజూరుకు నివేదిస్తాం.

– బాలరాజు, ఎంపీడీఓ, ఇల్లెందు మండలం

ఉపాధ్యాయుల పాత్ర కీలకం


చుంచుపల్లి: ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

చుంచుపల్లి: ప్రపంచం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశలో పయనించాలంటే, పాఠశాల స్థాయి నుండే విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా ప్రభుత్వ పరీక్షల అధికారి ఎస్.మాధవరావు అన్నారు. మండలంలోని బాబు క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరంతరం బోధనా విధానాలలో వచ్చే మార్పులను అభ్యసించడంతో చదువుతో పాటు సమాజం పట్ల అవగాహన కలుగుతుందన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు బూరుగు నీరజ ,కూరపాటి విజయ శ్రీ, చీదిరాల దుర్గా భవానీలను ఘనంగా సన్మానించారు. క్లబ్ ఆఫ్ కొత్తగూడెం అధ్యక్షుడు షేక్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి లగడపాటి రమేశ్, కోశాధికారి చెఱుకు శ్రీనివాస్, సభ్యులు పాలడుగు వర్ధనరావు, కూర శ్రీధర్, కొయ్యడ నగేష్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్సై, ఫొటోగ్రాఫర్లు

టేకులపల్లి: మారుతున్న కాలానుగుణంగా ఫొటోగ్రాఫర్లు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి అన్నారు. ఈ మేరకు ఈ నెల 6,7,8 తేదీల్లో కేబీఆర్ కన్వెన్షన్ హాల్, ఎల్‌బీనగర్, హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు ఫొటోగ్రాఫర్లకు నిర్వహించే ఫొటోగ్రఫీ ఎక్స్‌పో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం టేకులపల్లి మండలాధ్యక్షుడు ఆమెడ రవి, సభ్యులు, ఫొటోగ్రాఫర్లు శ్రీనివాస్, రమేష్, సైదులు, ప్రసాద్, దామోదర్, శ్రీకాంత్, రవి, కిరణ్, సురేష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ వారితో పనులు నిలిపివేయాలి


వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సత్తుపల్లిలో ప్రైవేట్ వారితో బొగ్గు హ్యాండ్లింగ్ పనులను వెంటనే నిలుపుదల చేయాలని గురువారం జీఎం పర్సనల్ (ఐఆర్‌పిఎం) బి.హనుమంతరావుకు సింగరేణి జాతీయ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... .సింగరేణి కార్మికులతో చేయించే పనులను ప్రైవేట్ వారికి సంవత్సరానికి 7.5 కోట్లతో టెండర్ ఇవ్వటం అన్యాయమన్నారు. ఇప్పటికైన యాజమాన్యం స్పందించి ఈ ప్రక్రియను నిలుపుదల చేయాలని లేని పక్షంలో భవిష్యత్‌లో జరిగే ఉద్యమాలకు యాజమాన్యమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రమణమూర్తి, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, నాయకులు హాసీఫ్, రమేష్, బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షులు మొగిలిపాక రవి, పాల్గొన్నారు.

కబ్జాకు యత్నించిన వారిపై చర్య తీసుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ స్థలాన్ని జీవో76ను అడ్డుపెట్టుకొని అక్రమంగా కాజేసేందుకు యత్నించిన వారిపై ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ మండిపడ్డారు. గురువారం రైతుబజార్ ఏరియాలో ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పుడు పత్రాలు సృష్టించి ఇంటి పట్టా కొరకు దరఖాస్తు చేసుకున్న సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసిన నేటికీ చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్ రావు, సాయి, కోమలి, వినయ్, సోను, నాని తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల కలెక్టరేట్ ముట్టడి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యల పరిష్కారం కోసం 11 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదని గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా చేశారు. మొదట నవభారత్ సెంటర్ నుండి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే.రమేష్, ఉపాధ్యక్షుడు ఎంవి.అప్పారావులు మాట్లాడుతూ.. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కరోనా సమయంలో సేవలందిస్తే వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పూనెం ఝాన్సీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డ రవికుమార్, సహాయ కార్యదర్శి వీరన్న, యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ధనలక్ష్మి, నాయకులు వజ్జ సుశీల, జయ, మాధవి, నీల, రుక్మిణి, విజయలక్ష్మి, భారతి పాల్గొన్నారు.

నేడు చీరలు పంపిణీ

పాల్వంచరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన బతుకమ్మ చీరలను నేడు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 34,992 చీరెలు వచ్చాయని, ఇందులో మండలానికి 12,657, పట్టణానికి 22,335 వచ్చాయని పేర్కొన్నారు.

కేసీఆర్‌తోనే ప్రతీగడపకు పథకాలు


సూపర్‌బజార్(కొత్తగూడెం): గృహలక్ష్మి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రతీగడపకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురాకుంటే సంక్షేమ పథకాలు బంద్‌కావడం తథ్యమని కొత్తగూడెం ఎంఎల్ఏ వనమా వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో గృహలక్ష్మి లబ్ధిదారులకు పత్రాలు, మహిళలకు బతుకమ్మ చీరెలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలోనే రాష్ట్రం నంబర్ వన్‌లో ఉందని, ఇవన్నీ నిరాటంకంగా అమలు కావాలంటే మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. కొత్తగూడెం ఆర్డీఓ శిరీష మాట్లాడుతూ.. మొత్తం 1,553 మంది గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 244 మంది అర్హులుగా తేల్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘు, తహసీల్దార్ పుల్లయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఉర్దూఘర్ బాధ్యులు, నాయకులు వనమా రాఘవేంద్రరావు, ఎం.ఏ.రజాక్, కాసుల వెంకట్, భీమా శ్రీధర్ పాల్గొన్నారు.

సుజాతనగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంతో పేదలకు సొంతింటి కల సాకారమవుతుందని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో 16 గ్రామ పంచాయతీలతో మంజూరైన గృహలక్ష్మి పథకం మంజూరీ పత్రాలను గురువారం సుజాతనగర్‌లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం పలువురు మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మెన్ భూక్యా రాంబాబు, సొసైటీ చైర్మెన్ మండె హనుమంతరావు, ఎంపీటీసీలు మానస,శోభారాణి,గణేష్, సర్పంచులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ టేకులపల్లి మండలంలో గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా శంభునిగూడెంలో సీసీ రోడ్డుని ప్రారంభించి పర్యటన మొదలు పెట్టారు. ఉలవచెలక, పెద్దచర్లపల్లి, ఇప్పలచెలక, కొప్పురాయి, రాజారాంతండా, బర్లగూడెం, బోడు, మొక్కంపాడు, పెట్రాంచెలక, అబ్బిరెడ్డిగూడెం, కోటల్ల గ్రామాల్లో రూ.8 కోట్ల 61 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో బాణోతు హరిసింగ్‌నాయక్, మండలాధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బోడ బాలు, కంభంపాటి చంద్రశేఖర్, రామ, కిషన్, బాలు, చీమల సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కంపెనీ స్థాయి క్రీడలు


ఇల్లెందు: క్రీడాకారులతో జీఎం అభివాదం


సింగరేణి(కొత్తగూడెం): క్రీడాకారులతో ఏరియా అధికారులు

ఇల్లెందు: రెండు రోజుల పాటు ఇల్లెందులోని సీఈఆర్ క్లబ్‌లో జరిగిన కంపెనీ స్థాయి క్రీడలు ముగిశాయి. గురువారం ముగింపు క్రీడల్లో పాల్గొన్న సింగరేణి ఇల్లెందు ఏరియాజీఎం జాన్ ఆనంద్ పాల్గొని గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ బాడీ బిల్డింగ్ టోర్నమెంట్ పోటీల ముగింపు సందర్భంగా జరిగిన అభినందన సభలో జీఎం జాన్ ఆనంద్ మాట్లాడుతూ.. కోల్ లెవల్ జరిగే క్రీడలలో ఇల్లెందు ఖ్యాతీని చాటాలని కోరారు. మిస్టర్ సింగరేణిగా ఎంపికైన రామకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, నాయకులు శంకర్, నజీర్ అహ్మద్, జగన్నాథం, బాలప్రసాద్, సిరాజ్ అహ్మద్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు పాస్నేట్, జాన్ వెస్లీ, రమేష్, అశోక్, శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి సుధాకర్, సాయి స్వరూప్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటల్ వాలీబాల్ పోటీల్లో పీవీకే–5 గ్రూప్ విజయం
సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని డబ్ల్యూపీఎస్ అండ్ జీఎ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో గురువారం పీవీకే-5 గ్రూప్, వీకే–7 గ్రూప్‌ల మధ్య జరిగిన వాలీబాల్ పోటీల్లో పీవీకె–5 గ్రూప్ విజయం సాధించింది. ఈ పోటీలను ఏరియా హానీనరీ సెక్రటరీ, జీకేఓసీ సీనియర్ పీఓ ములకల శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ.. క్రీడాకారులు ఏరియా లెవల్, రీజియన్ లెవల్, కంపెనీ లెవల్ పోటీల్లో విజయం సాధించి కోలిండియాలో సింగరేణి కీర్తిని ఇనుమడింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ సిహెచ్ సాగర్, జనరల్ కెప్టెన్ రాజశేఖర్, బన్ను, శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మలరాజు, గౌస్,ప్రేమ్, మహేష్, ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ


జూలూరుపాడు: గుండెపుడిలో చీరలు పంపిణీ


ఇల్లెందురూరల్: బాలాజీనగర్‌లో..

జూలూరుపాడు: జూలూరుపాడు మండలంలోని 18 రేషన్ దుకాణాల పరిధిలోని గ్రామాల్లో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. గుండెపుడి పంచాయతీ కార్యాలయంలో జూలూరుపాడు వైస్ ఎంపీపీ గాదె నిర్మల, సర్పంచ్ బానోత్ నరసింహారావులు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. రేషన్ డీలర్లు గలిగె చంటి, బానోత్ సంజీవ్, లక్ష్మణ్, మహిళలు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ రేషన్‌షాపులో బాలాజీనగర్, సుభాష్‌నగర్ పంచాయతీల పరిధిలో బతుకమ్మ చీరలను సర్పంచ్‌లు పాయం స్వాతి, వల్లాల మంగమ్మ, ఎంపీటీసీ శీలం ఉమ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాలవెల్లి నర్సింహారావు, కో–ఆప్షన్ సభ్యుడు ఘాజీ, వార్డు సభ్యులు ఆళ్ల నాగేశ్వరరావు, ధనుంజయ్, పంచాయతీ కార్యదర్శులు రజినీకాంత్, నీలిమ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలు అందజేయాలి

ఇల్లెందు: అర్హులైన పేద రైతులకు సకాలంలో వ్యవసాయ రుణాలను మంజూరు చేయాలని కోరుతూ యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేపట్టారు. గురువారం ఇల్లెందులోని యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేపట్టిన రైతులు బ్యాంక్ మేనేజర్‌కు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా రైతుల తరుపున ప్రజాపంథా నాయకులు చంద్ర అరుణ, బుర్ర వెంకన్నలు మాట్లాడుతూ అర్హులైన పేద రైతులను బ్యాంకు చుట్టూ ప్రదిక్షణలు చేయకుండా తక్షణం పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాల్సిన తరుణంలో పంట రుణాలు అందకపోతే తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంజ సమ్మయ్య, ఇస్లావత్ కోటేష్, దారావత్ వీరన్న, హరిలాల్, కమిలీ, శౌరీ, శంకర్ పాల్గొన్నారు.

వెలవెలబోతున్న ఎంపీడీఓ ఆఫీసు

పాల్వంచరూరల్: తమ సమస్యల పరిష్కారానికి ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు నలుగురు వారంరోజులుగా సమ్మెబాట పట్టడంతో పాల్వంచలోని ఎంపీడీఓ కార్యాలయం, పంచాయతీలో పరిపాలన కార్యకలాపాలు ఆగిపోయాయి. ఆపరేటర్లు లేక ఎంపీడీఓ కార్యాలయం వెలవెలబోతోంది. ఆపరేటర్ల సమ్మె కారణంగా నిత్యం పంచాయతీల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జీత భత్యాలకు సంబంధించిన వివరాలు కంప్యూటర్‌లో ఆన్‌లైన్‌చేసే దిక్కులేకుండాపోయింది.

